క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం అభివృద్ధి కోసం రూ.2.51 లక్షలు అయిలాపూర్ గ్రామానికి చెందిన కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, శంకర్‌గౌడ్, సంఘం అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్ మాట్లాడారు. అదే గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘం రూ. 50,116 విరాళం అందజేసినట్లు తెలిపారు. త్వరలో ఆలయం అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మారుతి, బైరయ్య, కౌడ రవి, నారాయణ, సంగయ్య, బాలయ్య, ప్రసాద్‌గౌడ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామ పారిశుధ్య కార్మికుడి భార్య సిరికొండ ఇందిర(38) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. దీంతో ఆదివారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నాయకులు మల్లేష్ యాదవ్, సుదర్శన్ గౌడ్, ఎడపల్లి శ్రీనివాస్, దయాకర్ రావు, రాజేందర్, రాజు, శ్రీధర్ రావు, తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా చంద్రారెడ్డి



భిక్కనూరు: గురుజకుంట గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం గ్రామస్తులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంట చంద్రారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బల్ల మల్లారెడ్డి, లోక రాఘవరెడ్డి, కార్యదర్శిగా కందాడి గంగారెడ్డి ఎన్నికయ్యారు .కార్యవర్గ సభ్యులుగా బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, ఎల్లేశం, రమేష్, యాదవ్, రాజిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు. అనంతరం అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో అప్పగించిన పదవికి తగిన న్యాయం చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నా సమష్టిగా పరిష్కరించుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): సోమారంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం కొనసాగింది. గ్రామంలో 10 రోజుల క్రితం పలువురికి జ్వరం, జలుబు, చర్మ వ్యాధి, దురద, దగ్గు, కీళ్లనొప్పులు తదితర వ్యాధులతో ఇబ్బందులు బాధపడుతున్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామంలోని డ్రైనేజీలలో పేరుకుపోయిన మురికిని తొలగించారు. మంచినీటి ట్యాంకులలో బ్లీచింగ్ పౌడరును చల్లారు. వైద్యులు రాజశేఖర్, ఏఎన్ఎంలు శోభారాణి, నర్సవ్వ, ఆశావర్కర్లు సౌందర్య, షమీం, లావణ్య, అనిత, కారోబారు బాలురాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. శనివారం నాటికి 57 వేల 722 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దంపతులు



కామారెడ్డి క్రైం/నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, కామారెడ్డి జెడ్పీ మాజీ చైర్ పర్సన్‌గా పని చేసిన ఆయన సతీమణి శోభలు ఆదివారం ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దఫేదార్ శోభ, రాజులతో జిల్లాకు సంబంధించిన పార్టీ వ్యవహారాలు, రాజకీయ పరిస్థితులపై ఎమ్మెల్సీ కవితతో చర్చించారు. కవిత ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అప్‌గ్రేడ్ చేశారు.. టీచర్లను మరిచారు

- నాలుగేళ్లుగా టీచర్ల పోస్టులు ఖాళీ
- ఇద్దరిని డిప్యుటేషన్‌పై పంపి సరిపెడుతున్న వైనం
- ఇదీ అంకోల్‌తండా ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాల పరిస్థితి
- పట్టించుకోని ప్రభుత్వం



అంకోల్ తండా ప్రభుత్వ గిరిజన పాఠశాల

నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంకోల్ తండాలోని ప్రభుత్వ గిరిజన పాఠశాల(డీఎన్‌టీ) గతంలో ప్రాథమికోన్నత పాఠశాలగా ఉండేది. నాలుగేళ్ల క్రితం స్థానికుల ప్రోత్సాహంతో విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఉన్నత పాఠశాలగా మార్చారు. కాని అప్పటి నుంచి కనీసం ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయకపోవడం గమనర్హం. 1 నుంచి 10వ తరగతి వరకు గతంలో ఉన్న ఉపాధ్యాయులతో కాలం వెల్లదీస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్, భౌతిక, గణిత శాస్త్రాలకు పాఠాలు నేర్పే ఉపాధ్యాయ పోస్టులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అంకోల్ తండా ప్రభుత్వ గిరిజన పాఠశాలలో ప్రస్తుతం 185 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే అప్‌గ్రేడ్ అవ్వక ముందు ఈ పాఠశాలకు ఏడుగురు ఉపాధ్యాయులున్నారు. వీరిలో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు ఉండేవారు. నాలుగేళ్ల క్రితం పదవ తరగతి వరకు అప్‌గ్రేడ్ అయింది. స్థానిక ప్రధానోపాధ్యాయుల కోరిక మేరకు మరో ఇద్దరు ఎస్‌జీటీలను డిప్యుటేషన్‌లో పంపించారు. కాని సాధారణంగా ఉన్నత పాఠశాలకు 14 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కాని ఇక్కడ మాత్రం ఇద్దరు డిప్యుటేషన్ల వచ్చిన ఉపాధ్యాయులతో కలిపి 9 మంది మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు.

కీలక సబ్జెక్టులకే స్కూల్ అసిస్టెంట్లు కరువు

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితం , ఇంగ్లిష్, ఫిజిక్స్ కీలక సబ్జెక్టులు. అయితే అంకోల్ తండా పాఠశాలలో మాత్రం ఈ మూడు సబ్జెక్టులకు ఎస్‌జీటీలే బోధిస్తున్నారు. పోస్టులు లేకపోవడం వల్ల ఒకే ఉపాధ్యాయుడు రెండు పాఠశాలలలో పని చేయాల్సి వస్తోంది. వారిపై పని భారం పడటంతో విద్యార్థులకు బోధించడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన ఉపాధ్యాయులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

పోస్టులు భర్తీ చేయాలి



ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు ఉంటే మంచి ఫలితాలు సాధిస్తాం. ఇప్పుడున్న ఉపాధ్యాయులపై పని భారం పడుతుంది. దీనితో కాస్త ఇబ్బంది పడుతున్నాం. వెంటనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి.

– ఎస్.స్వప్న, పదవ తరగతి, గిరిజన పాఠశాల

ఆటలకు పీఈటీలు లేరు



ఇతర పాఠశాలలో పీఈటీలు ఉండి ఆటలు ఆడిస్తారు. అందుకే వారు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణిస్తున్నారు. మాకు కూడా ఓ పీఈటీ ఉంటే ఉత్తమంగా ఆటలు ఆడి గ్రామం పేరును రాష్ట్ర స్థాయిలో నిలిపే వాళ్లం.

– ఎస్.భీమ్ సింగ్, పదవ తరగతి, గిరిజన పాఠశాల

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



ఉపాధ్యాయుల కొరత ఉంది. ఉన్నతాధికారులకు నివేదికను పంపించాను. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 14 మంది ఉండాల్సిన పాఠశాలలో 9 మందితో విద్యార్థులకు బోధిస్తున్నాం.

– బాల్‌రాజు, హెచ్‌ఎం, అంకోల్ తండా ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాల

ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధి కృషి చేస్తా

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



ఆలయంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో గల ఓంకారేశ్వరాలయంలో వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో హిందూ ఆలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. గతంలో ప్రతీ ఆలయానికి నిధులు కేటాయించానని గుర్తు చేశారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, వీరశైవ లింగాయస్ సమాజ్ అధ్యక్షుడు కపిల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



బాన్సువాడ: విధుల్లో అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ సీఐ అశోక్ అన్నారు. ఆదివారం కొత్తగా విధుల్లో చేరిన 13 మంది కానిస్టేబుళ్లను ఆయన అభినందించి సూచనలిచ్చారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం పనికి రాదని అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కొత్త కానిస్టేబుళ్లను సీఐ పరిచయం చేసుకుని జాయిన్ చేసుకున్నారు. నేటి నుంచి కొత్తగా వచ్చిన కానిస్టేబుళ్లకు విధులు కేటాయించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



బాన్సువాడ రూరల్: బోర్లంక్యాంపులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు ముగ్గురు ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగంలో రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. ఎంపికైన వారిలో హాసిని, సంజీవని, సింధు ఉన్నారని, వీరు ఈ నెల 13 నుంచి వరంగల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ సునీత, అధ్యాపకులు, విద్యార్థినులను అభినందించారు.

వాహనాల తనిఖీ



పిట్లం(జుక్కల్): పిట్లం–బాన్సువాడ రహదారిపై ఆదివారం పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఏఎస్సై లింబాద్రి మాట్లాడుతూ.. ఎస్సై ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వాహనదారులు వెంట ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు.

నాణ్యత లేని రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రజాప్రతినిధులు నాణ్యతతో రోడ్లు వేయకపోవడంతో రోడ్లు రెండు, మూడు సంవత్సరాలకే తారు తేలిపోయి కంకర కనిపిస్తోంది. తాడ్వాయి మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి దేవాయిపల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు ఉన్న రోడ్డు పరిస్థితి కూడా ఇలానే ఉంది. మూడు సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా తారు తేలిపోయి కంకర దర్శనమిస్తోంది. ఈ రోడ్డుపై వెళ్తుంటే నరకం కనిపిస్తోంది. అధికార యంత్రాంగం పట్టించుకొని తారు రోడ్డు త్వరగా వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తమ బ్లడ్ మోటివేటర్ అవార్డు



కామారెడ్డి టౌన్: రక్తదానం 74 సార్లు చేయడంతో పాటు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు ఉత్తమ బ్లడ్ మోటివేటర్ అవార్డును అందుకున్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవం కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్య త్యాగం మరువలేనిది



బాన్సువాడలో కిష్టయ్య సంస్మరణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



బీబీపేటలో కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు



దోమకొండలో..

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ అమర వీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి కార్యక్రమాలు జిల్లాలో పలు చోట్ల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాన్ని వక్తలు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం అమర్పించిన కానిస్టేబుల్ కిష్టయ్య త్యాగం మరువలేనిదని బాన్సువాడలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. తెలంగాణ సాధన కోసం ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన కోరారు.



లింగంపేటలో..



జిల్లా కేంద్రంలో..

మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి



కామారెడ్డి టౌన్: నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌ను ఆదివారం శేర్‌గల్లి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సంఘ భవనంలో సన్మానించారు. అనంతరం ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. త్వరలో జిల్లా కమిటీతో పాటు, యువ కమిటీని ఎన్నుకుని ప్రకటిస్తామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, క్రాంతి, కృష్ణ, గంగాధర్, రాజేశ్, రమేష్, వెంకట్రాజం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అభిషేకాలు



నిజాంసాగర్(జుక్కల్): కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం అచ్చంపేట సంగమేశ్వర ఆలయంలో వేద పండితుడు సంజీవ్ రావ్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి గ్రామస్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. వేద పండితుడు సంజీవ్‌రావ్ శర్మ, శంభు పంతులు, కిషన్ తదితరులున్నారు.

వేంకటేశ్వర ఆలయంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తాడ్వాయి నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు రాజాగౌడ్, సదాశివుడు, గంగారాం, రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా సంపాదించినట్లు రుజువు చేయాలి

- మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ సవాల్



మాట్లాడుతున్న ద్రోణవల్లి సతీష్

బాన్సువాడ: రాజకీయంగా తాను ఆస్తులు సంపాదించినట్లు రుజువు చేస్తే ఆ ఆస్తులను బీర్కూర్ మండలానికి ధారాదత్తం చేస్తానని బీర్కూర్ మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ సవాల్ చేశారు. ఆదివారం మల్లాపూర్‌లో తన నివాసంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం బీర్కూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. బైంసా వద్ద సీరాలలో తనకు 70 ఎకరాల భూమి ఉందని, ఆ భూమి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంట ఉండి సంపాదించానని భాస్కర్‌రెడ్డి తనపై విమర్శలు చేశారని, అక్కడ తనకు 39.23 ఎకరాలు భూమి ఉందని, అది కూడా బాన్సువాడ మండలం మొగులాన్‌పల్లిలో తనకున్న భూమి అమ్మి అక్కడ కొనుగోలు చేశానని తెలిపారు. తన కుటుంబానికి ముందు నుంచే ఆస్తులు ఉన్నాయన్నారు. ఎవరికి ఎంత ఆస్తులు ఉన్నాయో పట్టాపాసు పుస్తకాల జిరాక్సులను, ఏఏ బ్యాంకుల్లో ఎన్ని అప్పులు ఉన్నాయో జిరాక్సు కాపీలను విలేకర్లకు ఇచ్చారు. తన సవాల్‌ను స్వీకరించకుంటే భాస్కర్‌రెడ్డి బహిరంగా క్షమాపణ చెప్పాలని అన్నారు. దేవుడిపై ప్రమాణానికి కూడా సిద్ధమేనన్నారు. నాయకులు సాయిలు, శ్రీనివాస్, రాంబాబు, మారుతి తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



పిట్లం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు



గుండెనెమ్లి పాఠశాలలో గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావొస్తున్న సందర్భంగా జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విజయోత్సవాలలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. విజయోత్సవాలు ఈ నెల 9 వరకు జరుగనున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



రాజంపేట కేజీబీవీలో విద్యార్థులతో ఎంఈవో పూర్ణ చంద్రరావ్



ఎల్లారెడ్డిలో..



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో..



విద్యుత్ కాంతుల్లో గోపాల్‌పేట జీపీ కార్యాలయం

సరఫరా అయ్యేది మురుగా.. మంచి నీరా?



మురికి నీటిలో ఉన్న మిషన్ భగీరథ నల్లా కనెక్షన్

రాజంపేట: మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట కాలనీ ప్రాంతంలో మిషన్ భగీరథ పైపు లైన్ పూర్తిగా మురికి నీటిలో మునిగి ఉంది. సంబంధిత కాలనీవాసులకు ఈ పైపులైన్ గుండా నీరు సరఫరా అవుతుంది. పైపు లైన్ వద్ద పూర్తిగా మురికి నీటితో మునిగిపోవడంతో నీళ్ల పట్టుకోవాలంటే ఎక్కడ జ్వరాల బారిన పడతామోనని భయపడుతున్నారు. సంబంధిత మిషన్ భగీరథ అధికారులు ఈ సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కొత్త వంతెనతో తీరనున్న ఇబ్బందులు



బంజర సమీపంలో నిర్మిస్తున్న కొత్త వంతెన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేట నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై బంజర సమీపంలో గల ఇరుకు వంతెనతో ఏళ్ల తరబడి వాహనదారులు పడుతున్న కష్టాలకు తెరపడనుంది. మండలంలోని ప్రధాన రహదారిపై జాతీయ రహదారి పనులు కొనసాగుతున్న క్రమంలో బంజర సమీపంలోని ఇరుకువంతెనను తొలగించారు. ప్రస్తుతం ఇరుకు వంతెన వెడల్పుగా నిర్మించే పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటివరకు ఉన్న ఇరుకు వంతెన వల్ల భారీ వాహనాలతోపాటు బైక్‌లు అనేకమార్లు ప్రమాదాలకు గురై కొంతమంది మృత్యువాతపడగా మరికొంతమంది తీవ్రగాయాలపాలై ఆస్పత్రుల్లో చేరారు. ఎట్టకేలకు ఇరుకు వంతెనను తొలగించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: కల్యాణి గ్రామ మాజీ ఎంపీటీసీ శ్రీధర్‌గౌడ్ ఆదివారం మృతిచెందారు. ఆయన అంత్యక్రియలకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరై పాడెను మోశారు. శ్రీధర్‌గౌడ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే ఓదార్చారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సాయిబాబా, కాంగ్రెస్ నాయకులు సామెల్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, ఆరీఫ్ పాల్గొన్నారు.